ప్రత్యేక పాలనలోకి పల్లెలు

- 31తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం

పెగడపల్లి/గొల్లపల్లి/కథలాపూర్: శాసనసభ ఎన్నికలు ముగిశాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ మధ్యలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి చేస్తారా? అనే ప్రశ్నకు అసాధ్యమనే సంకేతాలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలకు మొదట అధికారులు హడావిడి చేసినా.. ఆ తరువాత నెమ్మదించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలపలేదు. దీంతో ఎన్నికలు నిర్దేశిత గడువు లోపు జరగవని, ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. జనవరి 31తో ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది.

గడువు లోపు ఎన్నికలు లేనట్లే..

కొత్త పంచాయతీ చట్టం ప్రకారం గడువు లోగా ఎన్నికలు నిర్వహించకపోతే ప్రత్యేకాధికారులను నియమించి పల్లె పాలన కొనసాగించాలి. గతంలో పదవీకాలం ముగిసిన పాలకవర్గంలో ఎన్నికలు జరిగేంతవరకు పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగేవారు. నూతన పంచాయతీ రాజ్ చట్టం దీన్ని అనుమతించట్లేదు. ఈ చట్టాన్ని సవరించాలంటే శాసనసభ ఆమోదం తప్పనిసరి. దీంతో ప్రత్యేకాధికారుల పాలన వైపే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

పాత రిజర్వేషన్లేనా?

2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. 2024 జనవరి 31తో పాలకవర్గాల గడువు ముగియనుంది. గత ఎన్నికల సమయంలో కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చారు. దీని ప్రకారం రెండు పర్యాయాలు రిజర్వేషన్ విధానం అమలులో ఉంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో పాత విధానాన్నే కొనసాగిస్తారా? మార్పులు చేస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది. ఒకవేళ చట్టాన్ని సవరించకుండా పాత విధానాన్ని కొనసాగిస్తే ఇప్పుడు రిజర్వుడు స్థానాల్లో సర్పంచ్‌గా ఉన్నవారు మరోసారి పోటీలో నిలిచే అవకాశముంటుంది.



పెగడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

బిల్లుల బెంగ

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నేటికి బిల్లులు రాలేదని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 20 మండలాలుండగా.. 380 పంచాయతీలున్నాయి. వీటికి జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయి. గతేడాది నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో.. సర్పంచులు తప్పని పరిస్థితుల్లో సొంత డబ్బులతో పాటు అప్పు చేసి ఖర్చు చేశారు. పంచాయతీల్లో కనీస సౌకర్యాలైన మౌలిక వసతుల నిర్వహణకు పెట్టిన ఖర్చులపై సర్పంచుల్లో ఆందోళన కనిపిస్తోంది. పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణకు నిధులు ఖర్చు చేసి బిల్లులు పెట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుంది. సర్పంచులకు పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లకు సంబంధించి సుమారు రూ.12కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో నూతనంగా 176 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కాగా.. 139 భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో 32 పూర్తి కాగా.. 107 ప్రగతిలో ఉన్నాయి.

పదవీకాలం పొడిగించాలి

కరోనా కారణంగా రెండేళ్ల పదవీకాలం వట్టిగనే గడిచిపోయింది. పేరుకే ఐదేళ్ల పాలనలో ఉన్నాం. మా పదవీకాలం పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేసినం. వాటికి సంబంధించిన రూ.25లక్షల వరకు బిల్లులు రావాలే. పదవీకాలం ముగియనుంది. వచ్చే బిల్లుల కోసం ఆందోళన చెందాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వం స్పందించి కొత్త పాలకవర్గం రాకముందే మాకు రావాల్సిన బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.



- ఇనుగంఢ్ల కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్, నామాపూర్

నిధులు విడుదల కావాల్సి ఉంది

గ్రామ పంచాయతీలకు సంబంధించిన బిల్లులు సుమారు జిల్లాలో రూ.12కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పనులకు సంబంధించి సాంకేతికపరమైన రికార్డులు చేసి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది.



- అబ్దుల్ రహమాన్, ఈఈ, పీఆర్

ఓటరు నమోదుకు స్పందన

మల్యాల: మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. మండలంలోని బూత్ స్థాయి అధికారులు గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ మునీందర్, ఆర్‌ఐ తిరుపతితో కలిసి మల్యాల, తాటిపల్లిలోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. మండలంలో రెండు రోజుల్లో కొత్తగా 300 మంది ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఓటరు కార్డులో తప్పుల సవరణకు మరో 37 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ మునీందర్ తెలిపారు.


మల్యాలలో ఓటరు నమోదు కేంద్రం సందర్శిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. 2 రోజులుగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల కోసం కొత్తగా ఓటర్ ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని 17 గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలు నిర్వహించారు. 18 నుంచి 19 ఏళ్ల వారు కొత్తగా ఓటర్ కోసం 66 మంది, 20 ఏళ్లు నిండిన వారు 44 మంది దరఖాస్తు చేసుకున్నారు. స్థానికంగా లేకపోవడం, మృతిచెందిన 31 మంది ఓటర్లను తొలగించారు. ఓటర్ల జాబితాలో 37 మంది తప్పొప్పులను సవరించినట్లు తహసీల్దార్ తెలిపారు.

అపూర్వ సమ్మేళనం

రాయికల్: పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదోతరగతి చదివిన బాల్యమిత్రులంతా కలిసి ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళిక రూపొందించారు.



క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందాలు

సారంగాపూర్: సైబర్ నేరాలపై, గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపతి అన్నారు. ఆదివారం గణేశ్‌పల్లి గ్రామంలో చట్టాలు, సైబర్ నేరాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాల వాడకం, 100 డయల్ వంటి అంశాలపై ఎస్సై వివరించారు. పోలీసుల కళాబృందాలు చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై బురదజల్లే యత్నం


మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: కాంగ్రెస్ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌పై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంట్లో వారు మాట్లాడారు. హబ్సీపూర్ సర్పంచ్ జైలుకు వెళ్తే కాంగ్రెస్‌కు ఏం సంబంధమన్నారు. కాంగ్రెస్‌పై బురదజల్లేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అధ్యక్షుడు నందయ్య, జున్ను రాజేందర్, రాధాకిషన్, నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ మ్యాచ్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గొల్లపల్లి: శ్రీరాముపల్లి గ్రామంలో కిష్టంపేట రాజిరెడ్డి-లచ్చవ్వ, గూతల గంగారెడ్డి-వెంకవ్వ జ్ఞాపకార్థంగా కేఆర్‌ఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను కిష్టంపేట రమేశ్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. మొదటి ప్రైజ్ రూ.10వేలు. ద్వితీయ ప్రైజ్ 5వేలు అందజేయనున్నట్లు తెలిపారు. యువకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి రంగులు



సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఎట్టకేలకు ఆదివారం రంగులు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పాటైన తెలంగాణ తల్లి విగ్రహానికి కొన్ని సంవత్సరాలుగా రంగులు వేయకపోవడంతో పూర్తిగా వెలిసిపోయింది. గ్రామానికి చెందిన యువ చైతన్య యూత్ సభ్యులు రంగులు వేయడంతో మళ్లీ విగ్రహం కొత్త శోభను సంతరించుకుంది.

ఎమ్మెల్యేను కలిసిన ఎన్‌ఆర్‌ఐ


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఐ

జగిత్యాల: జగిత్యాలకు చెందిన అప్‌లైడ్ మెటీరియల్ సంస్థకు వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న నలమాసు ఓంకార్ ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిశారు. ఆయన వెంట పట్టణ వైశ్యసంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణ తదితరులున్నారు.

క్రీడల్లో రాణించాలి


అభినందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాలకు చెందిన సాన్వి అండర్ 14 బాలికల కబడ్డీ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అభినందిస్తూ జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మెట్‌పల్లి: మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులాల్లో 5వతరగతిలో ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తుల గడువును ప్రభుత్వం ఈనెల 23 వరకు పొడిగించిందని స్థానిక బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటగిరి ఆనందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు గడువు లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలి


ఎమ్మెల్యే వివేక్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

మెట్‌పల్లిరూరల్: బైపాస్ రహదారి నిర్మాణ అలైన్‌మెంట్ మార్చాలని మెట్‌పల్లి మండలానికి చెందిన పలువురు రైతులు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి వివేక్‌కు వినతి పత్రం అందజేశారు.

రోడ్డుపై గుంతలు



కోరుట్లటౌన్: పట్టణంలోని ఇందిరా రోడ్‌లో రహదారిపై గుంతలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపై నీళ్లు నిలిచి గుంతలు తయారయ్యాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకొని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

నగర సంకీర్తన


అయిలాపూర్‌లో శోభాయాత్ర

కోరుట్లరూరల్: అయిలాపూర్‌లో ఆదివారం శ్రీసీతారాముల నగర సంకీర్తన నిర్వహించారు. పాటలు, భజనలతో సీతారాముడి విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టారు. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయ ఆలయంలో హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేస్తామని జైశ్రీరాం సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆలయ పూజారి దప్పూరి మధుసుదనాచారి, జైశ్రీరాం సేవాసమితి, హిందూవాహిని, వానర సేన సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయాలను శుభ్రం చేసిన భక్తులు


సిరికొండలో శుభ్రం చేస్తున్న భక్తులు

కథలాపూర్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం జరగనుండగా.. మండలంలోని గ్రామాల్లో దేవాలయాలను ఆదివారం భక్తులు శుభ్రం చేశారు. దేవాలయాలను నీటితో శుభ్రం చేశారు. ఆవరణలో ఉన్న చెత్తను సేకరించి దూరంగా పారబోశారు.

హనుమాన్ దేవాలయంలో..


కోరుట్లలో శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్లటౌన్: పట్టణంలోని బాలాజీరోడ్ హనుమాన్ దేవాలయంలో స్వచ్ఛ్ మందిర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ ప్రతినిధులు శుభ్రం చేశారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రతి ఇంట్లో 5 దీపాలు వెలిగించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు బింగి వెంకటేష్ కోరారు. చిరుమల్ల ధనుంజయ్, కలాల సాయిచందు, సాగర్, రాజశేఖర్, నగేష్, నరేష్, వెంకటి, ఆంజనేయులు, గోపాల్, శేఖర్, గణేశ్, రమేశ్, రాకేశ్, అమ్ము పాల్గొన్నారు.

ఊరూరా..

మల్యాల: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండలంలోని హనుమాన్ దేవాలయాలు, శివాలయాలను శుద్ధి చేసి పూజలు చేశారు. సోమవారం భజనలు, కోలాటాలతో ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించి అన్నదానం చేయనున్నారు.

శ్రీరాముడి జెండాల పంపిణీ


కొడిమ్యాలలో జెండాల పంపిణీ

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలోని సీతారామాలయ రామ భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు శ్రీరాముడి జెండాలను పంపిణీ చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు రామ భక్తులు పాల్గొన్నారు.

గోడలపై జైశ్రీరాం


ఇబ్రహీంపట్నంలో గోడపై వాల్ రైటింగ్

ఇబ్రహీంపట్నం: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలో 2 రోజులుగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోడలపై జైశ్రీరామ్ వాల్ రైటింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం చేసి రామాలయం నుంచి ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.

వెయ్యి టెంకాయల మొక్కు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో ఆదివారం గోదావరిఖని 8ఇంక్లయిన్‌కాలనీకి చెందిన భక్తుడు ఇంద్రసేన వెయ్యి టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. తన కుమారుడు అఖిల్ హిమచల్‌ప్రదేశ్‌లో ఆరు మాసాల క్రితం ప్రమాదానికి గురవ్వగా.. బాగావ్వాలని స్వామివారిని మొక్కుకున్నామన్నారు. తమ కోరిక నెరవేరడంతో కుటుంబ సమేతంగా కొండకు వచ్చి టెంకాలయ మొక్కు తీర్చుకున్నామని అన్నారు.

సంఘం-కార్యవర్గం

పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడిగా నవీన్


నూతన కార్యవర్గ సభ్యులు

రాయికల్: ఇటిక్యాల గ్రామంలోని పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా సింగని నవీన్, ఉపాధ్యక్షుడిగా జాప గంగాధర్, కోశాధికారిగా దాసరి నవీన్, ప్రధాన కార్యదర్శిగా బోగ రాజుకుమార్ ఆదివారం ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం

గొల్లపల్లి: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయింది. అధ్యక్షుడిగా బోజనపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఇనుగంటి గంగయ్య, నక్క గంగరాజం, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, గౌరవ సలహాదారులగా కోమల్ల వెంకటపతి, నక్క గంగయ్య, సహాయ కార్యదర్శిగా మిట్ట కిష్టయ్య, మద్దెల జగన్ మోహన్, కొప్పుల సుధాకర్, కరాజుల అంజి, కోశాధికారిగా జనుప శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొంకంటి రవి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొర్రె జాకబ్‌ను ఎన్నుకున్నారు.

బుగ్గారం ఇన్‌చార్జి సర్పంచ్‌గా రామకృష్ణగౌడ్

బుగ్గారం: బుగ్గారం గ్రామ సర్పంచ్ మూల సుమలతగౌడ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా శనివారం ఉత్తర్వుల నేపథ్యంలో బుగ్గారం ఇన్‌చార్జి సర్పంచ్‌గా నగునూరి రామకృష్ణగౌడ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆదివారం స్థానిక నాయకుడు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు, పెద్దలు ఆయనను సన్మానించారు.

నూతన నియామకం


నర్సయ్య

పెగడపల్లి: పెగడపల్లి గ్రామ శాఖ పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడిగా గాజుల నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు ఆదివారం సంఘం భవనంలో జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా బోగ గంగాధర్, ఉపాధ్యక్షుడిగా బోగ మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా బోగ రవి, కోశాధికారిగా బోగ అశోక్, ప్రచార కార్యదర్శిగా ముల్క రాజేశం, భక్త మార్కెండేయ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జడల వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా బోగ గోపి, ఉపాధ్యక్షుడిగా కటుకం గంగయ్య, సలహాదారులుగా కట్కం నర్సయ్య, బోగ భూమయ్య, సిరిపురం మల్లేశం, వేముల నందయ్య, తాటిపాముల భూమయ్య ఎన్నికయ్యారు.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం



బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి పట్టణ అభివృద్ధిలో భాగంగా కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులలో నాణ్యతాలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. నాసిరకమైన పనులు చేపట్టడంతో త్వరగానే వాటిలోని లోపాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ వెంట వేసిన సీసీ రోడ్డు పలుచోట్ల పగుళ్లు చూపింది. పనులు నాసిరకంగా చేపట్టడంతో ఈ పరిస్థితులు తలెత్తాయని ప్రజలు అంటున్నారు. అధికారుల పర్యవేక్షణలోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మర్రి చెట్ల కొమ్మలు

మల్యాల: మండల కేంద్రం నుంచి తాటిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మర్రిచెట్ల కొమ్మలు ప్రమాదరకంగా ఉన్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మల్యాల అడ్డ రోడ్డు నుంచి రెండు మర్రి చెట్ల వరకు మాత్రమే డబుల్ రోడ్డు ఉండగా, మర్రి చెట్ల నుంచి సుమారు 400మీటర్ల వరకు సింగిల్ రోడ్డు ఉండేది. ఇటీవల మర్రి చెట్ల నుంచి సైతం డబుల్ రోడ్డు వేయగా, మర్రి చెట్ల కొమ్మలు రోడ్డుపైకి విస్తరించి ఉన్నాయి. బస్సులు, భారీ వాహనాలు చెట్ల కొమ్మలకు ఢీకొనే ప్రమాదం ఉంది.



రామమందిరం ముగ్గు

జగిత్యాల: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని గౌతమి స్కూల్ అధ్యాపక బృందం కస్తూరి కవిత ఆధ్వర్యంలో రామాలయ ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు.



ప్రారంభానికి సిద్ధం

ఇబ్రహీంపట్నం: వర్షకొండ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ప్రారంభానికి ముస్తాబు కాగా.. సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించనున్నట్లు సర్పంచ్ దొంతుల శ్యామల ఆదివారం తెలిపారు. ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

